


## తోట

**<u>మూల వాక్యము : యోహాను 18 : 1</u>** యేసు ఈ మాటలు చెప్పి తన శిష్యులతోకూడ కెద్రోను వాగు దాటి పోయెను. అక్కడ ఒక తోట యుండెను, దానిలోనికి ఆయన తన శిష్యులతోకూడ వెళ్లెను.

**బైబిలులో మొదటి మానవుడైన మొదటి ఆదాము జీవితం తోటలో ప్రారంభమై తోట వెలుపట ముగిసింది. యేసు క్రీస్తు జీవితం పశువుల తొట్టిలో ప్రారంభమై తోటలో ముగిసింది.**

**<u>యేసు క్రీస్తు తోటలో సమాధి చేయబడుట – యోహాను 19 : 41</u>** ఆయనను సిలువవేసిన స్థలములో ఒక తోట యుండెను; ఆ తోటలో ఎవడును ఎప్పుడును ఉంచబడని క్రొత్త సమాధి యొకటి యుండెను.

**<u>రాజుల తోటలలో సమాధి చేయబడుట ఆనవాయితీ – 2 రాజులు 21 : 18</u>** మనష్షే తన పితరులతో కూడ నిద్రించి ఉజ్జాయొక్క తోటలో తన నగరుదగ్గర సమాధిచేయబడెను; అతని కుమారుడైన ఆమోను అతనికి మారుగా రాజాయెను.

*** యేసు క్రీస్తు రాజు గనుక ఆయన కూడ తోటలో సమాధి చేయబడ్డాడు.**

**తోట అనగా బాగుగా సేద్యము చేయబడి మొక్కలు నాటబడి ఆ మొక్కలు ఎదగడానికి అవసరమైన ఎరువు వేయబడి కావలసిన సమృద్ధియైన నీటి లభ్యత కలిగిన చోటు. పశువులు పాడు చేయకుండ చుట్టూ కంచె వేయబడినది. అయితే నీరులేని తోట ఫలింపకపోగా అది వాడిపోయి నరకబడి అగ్నితో కాల్చబడుతుంది. తోట అనేది ఒక విశ్వాసికి సాదృశ్యం మరియు ఒక సంఘానికి సాదృశ్యం.**

**<u>బైబిలులో చెప్పబడిన కొన్ని రకాల తోటలు :</u>**

**<u>1. కాల్చివేయబడిన తోట : యోవేలు 1 : 19</u>** అగ్నిచేత అరణ్యములోని మేతస్థలములు కాలిపోయినవి మంట తోటచెట్లన్నిటిని కాల్చివేసెను యెహోవా, నీకే నేను మొఱ్ఱపెట్టుచున్నాను.

**తోట ఎందుకు కాల్చివేయబడింది? : అది కొట్టివేయబడిన తోట గనుక.**

**<u>2. కొట్టివేయబడిన తోట : విలాప 2 : 6</u>** ఒకడు తోటను కొట్టివేయునట్లు తన ఆవరణమును ఆయన క్రూరముగా కొట్టివేసి యున్నాడు తన సమాజస్థలమును నాశనము చేసియున్నాడు యెహోవా సీయోనులో నియామక కాలము విశ్రాంతి దినము మరువబడునట్లు చేసియున్నాడు కోపావేశుడై రాజును యాజకుని త్రోసివేసి యున్నాడు.

**తోట ఎందుకు కొట్టివేయబడింది (నరకబడింది)? : అది వాడిపోయిన తోట గనుక.**

**<u>3. వాడిపోయిన తోట : యోవేలు 1 : 12</u>** ద్రాక్షతోట కాపరులారా, రోదనము చేయుడి. ద్రాక్షచెట్లు చెడిపోయెను అంజూరపు చెట్లు వాడిపోయెను దానిమ్మ చెట్లును ఈతచెట్లును జల్దరు చెట్లును తోట చెట్లన్నియు వాడిపోయినవి.

**తోట ఎందుకు వాడిపోయింది? : దానికి నీరులేదు గనుక.**

**<u>4. నీరులేని తోట : యెషయా 1 : 30</u>** మీరు ఆకులు వాడు మస్తకివృక్షమువలెను నీరులేని తోటవలెను అగుదురు.

**తోట అనేది ఒక వ్యక్తికి మరియు ఒక సంఘమునకు సాదృశ్యముగా ఉన్నది. ఏ వ్యక్తి జీవితంలో వాక్యము అనే నీరు వుండదో ఏ వ్యక్తి అయితే వాక్య పఠనానికి వాక్య ధ్యానానికి వాక్యానుసారమైన ప్రవర్తనకు చోటు ఇవ్వడో ఆ వ్యక్తి వాడిపోయి ఆత్మీయ జీవితంలో చనిపోయి నరకములో వేయబడి కాల్చబడుతాడు. అలాగే ఏ సంఘములో వాక్య బోధనకు ప్రాధాన్యత**
**ఉండదో ఆ సంఘము కూడ నీరులేని తోట వలె క్షీణించిపోతుంది.**

**అలాగే ఏ వ్యక్తి జీవితంలో అయితే వాక్య పఠనానికి వాక్య ధ్యానానికి వాక్యానుసారమైన ప్రవర్తనకు చోటు ఉంటుందో ఆ వ్యక్తి ఎలా ఉంటాడో వాక్యములో గమనిద్దాం. అలాగే ఏ సంఘములో వాక్య బోధనకు ప్రాధాన్యత ఉంటుందో ఆ సంఘం ఎలా ఉంటుందో వాక్యంలో గమనిద్దాం.**

**1. నీళ్లుపారు తోట : యిర్మియా 31 : 12** వారు వచ్చి సీయోను కొండ మీద ఉత్సాహధ్వని చేతురు; యెహోవా చేయు ఉపకారమునుబట్టియు గోధుమలనుబట్టియు ద్రాక్షారసమునుబట్టియు తైలమునుబట్టియు, గొఱ్ఱెలకును పశువులకును పుట్టు పిల్లలనుబట్టియు సమూహములుగా వచ్చెదరు; వారికి నెన్నటికిని కృశింపక నీళ్లుపారు తోటవలె నుందురు.

**2. నీరు కట్టిన తోట : యెషయా 58 : 11** యెహోవా నిన్ను నిత్యము నడిపించును క్షామకాలమున ఆయన నిన్ను తృప్తిపరచి నీ యెముకలను బలపరచును నీవు నీరు కట్టిన తోటవలెను ఎప్పుడును ఉబుకుచుండు నీటి ఊటవలెను ఉండెదవు.

**3. నదీ తీరమందలి తోటలు : సంఖ్యా 24 : 6** వాగులవలె అవి వ్యాపించియున్నవి నదితీరమందలి తోటల వలెను యెహోవా నాటిన అగరు చెట్లవలెను నీళ్లయొద్దనున్న దేవదారు వృక్షములవలెను అవి యున్నవి.

**4. యెహోవా తోట : యెషయా 51 : 3** యెహోవా సీయోనును ఆదరించుచున్నాడు దాని పాడైన స్థలములన్నిటిని ఆదరించి దాని అరణ్యస్థలములను ఏదెనువలె చేయుచున్నాడు దాని యెడారి భూములు యెహోవా తోటవలెనగునట్లు చేయుచున్నాడు ఆనంద సంతోషములును కృతజ్ఞతాస్తుతియు సంగీతగానమును దానిలో వినబడును.

**5. ప్రఖ్యాతి కొరకై తోట : యెహెజ్కేలు 34 : 29** మరియు వారు ఇక దేశములో కరువు కలిగి నశించిపోకుండను అన్యజనులవలన వారి కవమానము ప్రాప్తించకుండను వారి ప్రఖ్యాతి కొరకై తోట యొకటి నే నేర్పరచెదను.

**ఏదెను తోటలో మరియు గెత్సెమనే తోటలో జరిగిన సంభవాలలోని వ్యత్యాసాన్ని గమనిద్దాం.**

| ఏదెను తోట | గెత్సెమనే తోట |
|---|---|
| 1. మొదటి ఆదాము | 1. కడపటి ఆదాము |
| 2. దేవుడు మాట్లాడిన స్థలము | 2. దేవునికి ప్రార్థించిన స్థలము |
| 3. అవిధేయతను చూపించాడు | 3. విధేయతను చూపించాడు |
| 4. పాపి | 4. పరిశుద్ధుడు |
| 5. మహిమను పోగొట్టుకున్నాడు | 5. మహిమ పరచబడబోతున్నాడు |
| 6. దేవుని యెదుటికి రాకుండా దాగుకొన్నాడు | 6. దేవుని యెదుట మోకరించాడు |
| 7. తోట నుండి వెళ్లగొట్టబడినాడు | 7. సిలువ వేయబడుటకు తోటలో అప్పగింపబడినాడు. |

**ముగింపు :** దేవుని సన్నిధి అని పేరు పెట్టబడిన ఏదెను తోటలో నుండి మొదటి మానవుడు వెళ్లగొట్టబడినాడు. ఆ దేవుని సన్నిధికి తిరిగి మానవుని చేర్చటానికి యేసు క్రీస్తు గెత్సెమనే తోటలో అప్పగించబడి తోటలో సమాధి చేయబడి పున:రుత్థానుడై మహిమ పరచబడ్డాడు. మనలో ప్రతి ఒక్కరము ఏదో ఒక దినాన ఈ లోక యాత్ర ముగించి సమాధుల తోటలో సమాధి చేయబడుతాము. అయితే ప్రభవు రెండవ రాకడలో సమాధులు తెరువబడినప్పుడు పరిశుద్ధులు మొదట లేపబడి ప్రభువుతో కూడ సదా కాలము జీవించుటకు పరలోకము అనే దేవుని సన్నిధిలో (ఏదెనులో) చేర్చబడుతారు. అలా చేర్చబడాలి అంటే దేవుని మందిరమనే తోటలో నాటబడాలి.

అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక. ఆమేన్.